క్లుప్తంగా

ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ శశాంక

అమలాపురం టౌన్: ఆకతాయిల వేధింపుల పట్ల ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని డీఐఈవో వనుము సోమశేఖరరావు, మహిళా ఎస్ఐ శశాంక అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆకతాయిల విషయంలో ఆడపిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వారు వివరించారు. విద్యార్థినులకు ఎవరివల్ల అయినా ఇబ్బందులు తలెత్తితే వెంటనే కళాశాల అధ్యాపకులకు, తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం, ఏఎస్ఐ రషీద, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు నిత్యావసరాల కిట్‌ను అందజేస్తున్న పిన్నమరాజు వెంకటపతిరాజు

ఐ.పోలవరం: ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామం పెమ్మిరెడ్డిపాలేనికి చెందిన పెన్నాడ అనసూయ కుటుంబానికి వంట సామగ్రి, బియ్యం, టార్పాలిన్, హైజనిక్ కిట్లను జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు శనివారం అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఎంఎస్ఎన్ రాజు, పి.హనుమంతు, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, వీఆర్వో కె.బాలాజీ, వీఆర్వో ఎస్.శ్రీనుబాబు, డీపీహెచ్ గౌతమి, దీపిక పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ మెకానిక్‌లకు సత్కారం




సీనియర్ మెకానిక్‌లను సత్కరించిన సంఘం అధ్యక్షుడు సత్తిబాబు

అమలాపురం రూరల్: మండలంలోని కొంకాపల్లిలో అమలాపురం సిద్ధి వినాయక మెకానిక్ యూనియన్ సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ మోటార్ సైకిల్ మెకానిక్‌లు వేమన అన్నవరం, రాయుడు వెంకటేశ్వరరావు, కేతా చంద్రరావు, కురసా వెంకట్రావు, పాలెపు వరహాలు, వీర సూరిబాబులను సంఘం అధ్యక్షుడు సాధనాల సత్తిబాబు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సి.రమణ, ఉపాధ్యక్షుడు కాండ్రేకుల కృష్ణ, కోశాధికారి మట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ మృతికి సంతాపం

ముమ్మిడివరం: తమిళనాడు రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను దుండగులు హత్య చేయడాన్ని ముమ్మిడివరం నియోజకవర్గ బహుజన పార్టీ నాయకులు ఖండించారు. స్థానిక పోలమ్మ చెరువు వద్ద శనివారం జరిగిన బహుజన సమాజ్ పార్టీ సమావేశంలో ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుసుమ శ్రీనివాస్, కస్నీటి శ్రీనివాస్, బండి మరిడేష్, జనిపల్లి మహేంద్ర, విపత్తి శ్రీనివాస్, మందిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి చెరువు పరిశీలన



జి.వేమవరంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం తాగునీటి చెరువును ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పరిస్థితిని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.శ్రీదేవి, ఏఈ టి.మారుతీరావులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు పంచాయతీల ప్రజలకు తాగునీటిని అందించే ఈ చెరువు మరమ్మతుల పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జి.వేమవరం గ్రామానికి చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు పుణ్యమంతుల సత్యవతి పింఛన్ లేక ఇబ్బంది పడుతున్నానని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుకు మొరపెట్టుకుంది. రేషన్ కార్డులో తన సోదరుడుకి పింఛన్ అందుతుండడంతో తనకు రావడం లేదని తెలిపింది. పంచాయతీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు భూమిపూజ చేశారు.

రేబిస్ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గం



పత్తిగొందిలో పెంపుడు కుక్కకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి దవులూరి సుధ



పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న పశుసంవర్ధక ఉప సంచాలకులు డాక్టర్ కర్నీడిమూర్తి



ఉప్పలగుప్తంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను వేస్తున్న ఏడీ నాగేశ్వరరావు



వన్నెచింతలపూడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సహాయ సంచాలకుడు విజయరెడ్డి

తాళ్లరేవు: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్ వ్యాధికి చికిత్స లేనందున నివారణ ఒక్కటే మార్గమని, ఈ వ్యాధి నివారణపై అధికారులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శనివారం జునోసిస్ డే సందర్భంగా పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు ఉచితంగా వ్యాక్సిన్‌లు వేశారు.

కార్యక్రమాన్ని తాళ్లరేవు ఏడీ డి.బ్రహ్మవేద ప్రారంభించారు. అన్ని వెటర్నరీ డిస్పెన్సరీలలో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని బ్రహ్మవేద తెలిపారు. శిబిరంలో 32 కుక్కలకు ఉచితంగా వ్యాక్సిన్‌లు వేసినట్లు పశు వైద్యాధికారి దవులూరి సుధ తెలిపారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం టౌన్: జంతు సంక్రమిత వ్యాధులపై పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ కర్నీడిమూర్తి అన్నారు. ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా స్థానిక నల్లవంతెన సమీపంలో గల ఏరియా పశువుల ఆస్పత్రి వద్ద సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ కర్నీడి మూర్తి మాట్లాడారు. ఈ సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జంతు సంక్రమిత వ్యాధుల కారణంగా ర్యాబిస్ వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ, పశు వైద్యాధికారులు నారాయణరావు, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులపై జాగ్రత్త వహించాలి

ఉప్పలగుప్తం: ప్రజలు పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు వహించాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఏరియా పశు వైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను వేశారు. అనంతరం కూనవరం గ్రామంలో ఎంపీపీ పాఠశాల వద్ద ర్యాబిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సత్యనారాయణ, గోపాలమిత్ర నిమ్మకాయల శ్రీ కృష్ణార్జునుడు, సహాయ సంచాలకులు ప్రదీప్, గాంధీ, గోవిందు, చందన, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

అమలాపురం రూరల్: పశుపక్షాదుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని అమలాపురం పశుసంవర్ధశాఖ సహాయసంచాలకులు ఎల్.విజయరెడ్డి సూచించారు. ప్రపంచ పశు సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పశువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా ఏటా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ పూర్ణమనాగలక్ష్మి, నారాయణరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు

అమలాపురం టౌన్: స్థానిక 29వ వార్డు పరిధిలో బైపాస్ రోడ్డు సమీపంలోని శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు అబ్బిరెడ్డి చంటి, ఏడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులతో కలిసి కమిషనర్ మనోహర్ శ్మశానాన్ని శనివారం పరిశీలించారు. శ్మశానంలో గుర్తించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ నాగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా గాయత్రీ సహిత మహాలక్ష్మి హోమం



గాయత్రీ సహిత మహాలక్ష్మి హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: వారాహి నవరాత్ర పూజా మహోత్సవాల్లో భాగంగా స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో శనివారం గాయత్రీ సహిత మహాలక్ష్మి హోమం వైభవంగా జరిగింది. హోమంలో భక్తులు సామూహిక మంత్ర పారాయణ చేశారు. పెద్దిరెడ్డి వెంకట దుర్గేష్, లక్ష్మీదివ్యజ్యోతి దంపతులు కర్తలుగా హోమాన్ని నిర్వహించారు. వారాహి పూజా మహోత్సవాలకు పెద్దిరెడ్డి మోహన్ శ్రీసాయి మణికంఠ రూ.10 వేల విరాళాన్ని గౌతమ మహర్షి అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగకనకదుర్గ, సభ్యులకు అందజేశారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పేరయ్యరాజు



పేరయ్యరాజు

తాళ్లరేవు: స్థానిక లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పొన్నాడ పేరయ్యరాజు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. అధ్యక్షుడు పేరయ్యరాజు, కార్యదర్శి పెనుమల్లు నరేంద్ర వరప్రసాదరెడ్డి, కోశాధికారి కట్టా ఆదినారాయణ తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి మల్టిపుల్ జీఎల్‌టీ కో–ఆర్డినేటర్ డీవీఎస్ రాజు నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



నూతన కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, సత్యనాగేంద్రమణి

అల్లవరం: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావిలాల మహేష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో సమర్థవంతంగా నడిపించాలని, తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, బస్వాని పద్మ, దొమ్మేటి సురేష్, కర్రి శ్రీను, బస్వాని రాజు, ప్రమోద్ పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: కలెక్టర్ రావిలాల మహేష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు స్థానిక కలెక్టరేట్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా మరింత ప్రగతి సాధిస్తుందని ఆకాంక్షించారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, చిత్రపు రామకృష్ణ, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నయ్యదాసు, బండారు గోవిందు, కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



వరద అప్రమత్తతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్

అల్లవరం: గోదావరికి వరద నీరు పోటెత్తితే ఎలా ఎదుర్కోవాలనే విషయంపై శాఖలవారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వ్యవసాయం, డ్రెయిన్స్, విద్యుత్, మత్స్య, ఇరిగేషన్, హౌసింగ్, ఉపాధి, వెలుగు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జులై, ఆగస్టు నెలల్లో సంభవించే వరదల కారణంగా మండలంలోని బోడసకుర్రు, గోపాయిలంక, గోడి, రెబ్బనపల్లి, అల్లవరం గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. వరదలు పోటెత్తితే రైతులను అప్రమత్తం చేయడం, పడవలను అందుబాటులో ఉండటం, బాధితులను రక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, భోజన సౌకర్యాలు, బలహీనమైన ఏటిగట్లు, కాలువగట్లకి ఇసుక బస్తాల ఏర్పాటు తదితర ప్రణాళికలను అధికారులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డ్రెయిన్స్ ఏఈ సునీతా, ఇరిగేషన్ ఏఈ రెహమాన్, ఎఫ్‌డీఓ అశ్విని, హౌసింగ్ సుబ్బారావు, ఏపీఓ శ్రీనుబాబు, ఏపీఎం సయ్యద్, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే అనర్థాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం రూరల్: నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే అనేక అనర్థాలు తలెత్తుతాయని జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా అన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో విద్యార్థులకు అమలాపురం, లీగల్, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం రోడ్ సేఫ్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గౌరీశంకరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణిస్తే సీట్ బెల్ట్ పెట్టుకోవడం తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలను అతిక్రమిస్తే కలిగే అనర్థాలు, దానికి చట్టరీత్యా పడే శిక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడ్వకేట్ డీవీవీఎస్ మూర్తి, కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, న్యాయవాది కేవీవీ సత్యనారాయణ, రూరల్ సీఐ వీరబాబు, తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను సత్వరమే నిలిపివేయాలని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు లంక వరప్రసాదరావు, దంగేటి చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాత్రి వేళల్లో అనుమతి లేకుండా మట్టి, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ మట్టి, ఇసుక తవ్వకాల నివారణకు ప్రత్యేక బృందాలు నియమించమన్నారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం అక్రమ మట్టి తవ్వకాల గురించి స్థానికుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మట్టి అక్రమాలపై ఫిర్యాదులు ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సూరపురెడ్డి సత్య, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్, వీఆర్ఓ బి.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి

అల్లవరం: రామచంద్రాపురం మండలం వెల్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీదాస్ అన్నారు. గోడిలంకలో శనివారం నిర్వహించిన కేవీపీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గెడ్డం విజయ్‌కుమార్, తాడి కిరణ్, కుంచే సుభాష్, ఎల్లమిల్లి బాబి, ఉప్పే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసంపై ఖండన

ఐ.పోలవరం: రామచంద్రపురం నియోజకవర్గం వెల్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని కేశనకుర్రు పెదపేట నాయకులు ఖండించారు. కేశనకుర్రు పెదపేట యలమంచిలి వాసు స్వగృహంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ నియోజకవర్గంలోనే ఘటన జరిగిందని, ఇటువంటి అమానుష చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తాళ్లూరి ప్రసాద్, యలమంచిలి వాసు, రేవు వెంకటేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన వేంకటేశ్వరుని ఆలయాల్లో అంతటా గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

బీజేపీ ఇన్‌చార్జిగా నిర్మల్‌కుమార్ సురేనా

యానాం: పుదుచ్చేరి బీజేపీ ఇన్‌చార్జిగా నిర్మల్‌కుమార్ సురేనాను తిరిగి నియమిస్తూ శనివారం పార్టీ జాతీయ కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం నూతనంగా ఇన్‌చార్జిని నియమించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవలి జరిగిన పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల్లో సురేనా ఎన్డీయే కూటమిలో కీలకపాత్ర వహించారు. ప్రస్తుతం పుదుచ్చేరి రాజకీయాల్లో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి మధ్య విభేదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో సురేనా ఈ సమస్యలను పరిష్కరిస్తారని భావిస్తున్నారు.

రాజకీయ ధురంధరుడు బాబూ జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అమలాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



యానాంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

- ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు
- ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి

అమలాపురం టౌన్: నైతిక విలువలతో దేశ ఉప ప్రధానమంత్రి పదవికి వన్నె తెచ్చిన బాబూ జగ్జీవన్‌రామ్ రాజకీయ ధురంధరుడని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఉద్యోగుల సంఘం, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, మాదిగల పొలిటికల్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శనివారం జరిగిన బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీతో పాటు మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల ప్రతినిధులు యార్లగడ్డ రవీంద్ర, పెనుమాడి జాన్సన్ బిల్లీ, మడికి సత్యనారాయణ, మట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి

అమలాపురం టౌన్: సమాజంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దేశ తొలి ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ కృషి అజరామరమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్లు కూడా నివాళులర్పించి ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్నయ్యదాసు, కొల్లాటి దుర్గాబాయి, రెడ్డి సత్యనారాయణ, క్వాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భీమ్‌నగర్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశ రక్షణ తదితర రంగాల్లో చేపట్టిన సంస్కరణలు, దళితుల సంక్షేమానికి పాటుపడిన వైనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ జిల్లెల్ల ప్రభాకరరావు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ముమ్మిడివరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు గట్టు వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, పెన్మత్స జగప్పరాజు, పి.ఉదయ భాస్కరవర్మ, పి.ధర్మారావు, ఎం.శివప్రసాద్, దివి వెంకన్న, కాశి అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మండలంలోని కొత్త మురమళ్ల పెదపేట గ్రామంలో బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.